కథానిక :

కొండవాడు

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

అబ్బో! యివాళా, నిన్నానా. ఆ శేత్ర క్రీతపు ముచ్చట అది. అయినా తలుచుకున్నప్పుడల్లా ఒళ్లు ఝల్లుమంటూ ఉంటుంది.

హఠాత్తుగా మమ్మల్ని "సిబీ" వెళ్లమన్నారు. మేఘలూ, స్కెచ్చూ పుచ్చుకుని కార్యక్రమం ముపాయిదాగా వేసుకున్నాం ఓగంటలో. తిరు కేంద్రంనుంచి చెన్నపట్నం, అక్కణ్ణుంచి గ్రాండ్ట్రంక్‌లో ఢిల్లీ, తరవాత రోహ్రీ, ఆపైన "సిబీ"ని. "సిబీ"నుంచి క్వెట్టా అంది పుచ్చుకున్నట్టు ఉంటుంది. అక్కడే వచ్చి పడింది వ్యాసఘట్టం.

ఇంకా లోపలికి జొచ్చుకుపోవాలి. ఆఫ్ఘనిస్థానంలో మా స్థావరాలు పదిలపరుచుకోవాలి. మహాక్లిష్టపరిస్థితి. ఏమంటారా? అక్కడ అంతా కొండవాళ్లు, తురకవాళ్ళూను. ఒట్టి పశుప్రాయులు. శాంకా సమాధానా లంటూ ఉండవు వాళ్ళకి. చెయ్యిచేసుకోవడమేగాని, నోరు చేసుకోవడం ఎన్నడూ ఎరగరు. అదైనా ఎక్కడో పొంచుండి అర్ధరాత్రో అపరరాత్రో మీద విరుచుకుపడతారు. ఒంటిగా ఆ ప్రదేశాల్లో తిరుగాడినవాడు తిరిగి నిరపాయంగా శిబిరానికి చేరుకున్నాడంటే యముణ్ణి జయించాడన్నమాటే! అందులోనూ మా జట్టులో ఒక శుక్కగూడా ఉన్నాడు, అతీనుజాకీలాగ మూగెడు బవిరిగెడ్డాం దిగదువ్వుకుని "అన్యమతస్థులని పరిమార్చడమే మోక్షప్రదమని నమ్ముతారు వాళ్ళు, జాగ్రత్తసుమండీ!" అన్న హెచ్చరికతో బయలుదేరేం. ఆ మాటలు నా చెవుల్లో గింగురమంటూనే ఉన్నాయి. సూట్లూ బూట్లూ వేసుకోవడంవల్ల మేం కొంత కమ్ముకుపోగలం అని ధైర్యం చెప్పుకున్నా, యీ గెడ్డాపాయన దగ్గిర వొచ్చేది గొప్పచిక్కు!

2

ఓనాడు ప్రొద్దున్నే లేచి వాళ్ళ చహారా కనిపెడదామని బయలుదేరేను. మేకలమందని తోలుకుపోతున్నాడు ఓకుర్రవాడు. చిత్రం ఏమిటా? వాడి చేతిలో చేపాటి కర్రకి బదులు తుపాకి ఉంది. తొడుక్కున్నది ఒక చెయ్యి లేని చొక్కా, వాడి తండ్రిదో పినతండ్రిదో కాకినిక్కరూను. పదహారు పద్దెనిమిది ఏళ్ళకన్న ఎక్కువ ఉండవు. కాని మనిషి ఆజానుబాహు. ఆరు అడుగులపైన ఉంటాడు. దండలు కమ్మెచ్చులాగ ఉన్నాయి. బల్లపరుపుగా విశాలమయినఛాతీ, బొత్తాయిలులేని ఆ చొక్కా తనకి చాలదని చెప్పక చెబుతోంది. నిక్కరు జేబులు ఎత్తుగా ఉన్నాయి.

ఇరవై గజాల దూరంలోఉన్న నన్ను ఎలాగ పసికట్టేడో వేటకుక్కలాగ. గభుక్కున తిరిగి తుపాకీ యెత్తేడు. ఇంతట్లోకే నా దుస్తులసరంజాంచూసి కాబోలు, ఎత్తిన తుపాకీ దింపేసేడు. సలాంచేసి తన దారిని పోబోయేడు. "ఏయ్" అని పిలిచేను.

వాడు తిరిగి నుంచున్నాడు.

"తుపాకీ ఎక్కడిదీ" అని హుందాగా ప్రశ్నించేను.

"నాదే"

ఆజవాబులో ఎంతమాత్రం కళవళంలేదు.

"ఎందుకు పట్టుకెళుతున్నావు?"

"ఎందుకేమిటి? నిత్యంచూస్తూను."

మాట వెళుసుగా ఉందన్నమాటేగాని హృదయంలో ఏమీ కల్మషంలేదు. కాగా, నేను అక్కడ అధికారవర్గంలో వాణ్ణే నన్న భ్రమలో ఉన్నాడు. అసలుసంగతి ఎందుకు చెప్పాలి? చెబితే ఏం కొంప మునుగుతుందో!

"సరే, వెళ్లు"

నిర్భయంగా ఎప్పటిలాగా నడక సాగించేడు వాడు. జేబులో రివాల్వరు భద్రంగా ఉన్న సంగతి నిశ్చయపరుచుకొని మరీ వెంటపడ్డాను, నేను.

అంతా కాలిబాటే; రోడ్డు కాదు. రాళ్ళూ రప్పలూ చిందరవందరగా ఉన్నాయి బాట మ్మట. త్వరగా కాళ్ళుపీకడం ఆరంభించేయి. నాగరికతా నాజూకు పెరిగిపోయి ఒట్టి "జపాను సరుకు"అయిపోయేం, రండికీ మొండికీ ఓర్చి పని చెయ్యాలంటే మనవశమా?

వాడి ధర్మమా అని మరో పది గజాలలో మందని ప్రక్కకి గుట్టకేసి మళ్ళించి ఓబండరాతి మీద చతికిలబడ్డాడు. బతికేం భగవంతుడా అనుకుని నేనూ ఉన్నచోటే కూలబడ్డాను.

తుపాకీ ఓసారి చేతుల్లోకి తీసుకున్నాడు. పసిపాపని రెండుచేతులుతోటి ఎగరేసినట్టు అతి ఆప్యాయంగా ఆ ఆయుధాన్ని వాడు అరిచేతుల్లోఉంచుకున్నాడు. అల్లల్లాడించేడు. నిశ్శబ్దంగా పెదిమెలు ప్రక్కకి పరిగెత్తేటట్టు దరహాసం చేసి, దాన్ని తుష్టహృదయంతో ప్రక్కని నిలుచోబెట్టేడు.

ఇంతట్లోకే ఒక చిన్నమేకపిల్ల అరిచింది. ఛటుక్కున తలయెత్తిచూసేడు. నేనూ అప్రయత్నంగా దృష్టి ఆ వంకకే సారించేను. పోతుమేక ఒకటిదానిని కుమ్ముతోంది. ఒక్కదాటులో వెళ్లేడు. పోతుమేకడొక్కలో ఒక్కతాపుతన్ని, పిల్లని ముచ్చటగా రెండుచేతులతోను పొదివి పట్టుకుని ముట్టెని ఆఘ్రాణించేడు. దాన్ని అలా చేతుల్లో యిముడ్చుకునే ఉల్లాసంగా వెర్రిగెంతులు వేసేడు. తరవాత భద్రంగా నేలకి దింపి, దాని వీపుతట్టేడు. అది గెంతులువేస్తూ "మేమే" అని అరుస్తూ తల్లిదగ్గిరికి పోయి పొదుగులో మూతిపెట్టింది. వీడు దాని వైపే రెప్ప వెయ్యకుండా చూసేడు. హృదయం తెరుచుకునేటట్టుగా నవ్వి, పాలుత్రాగుతూన్న దాని దగ్గరే నిలుచున్నాడు, వీపు నిమురుతూను.

కొండవెధవదికూడా ఎంత జాలిగుండె!

పదినిమిషాలు గడిచేయి. వాడు తిరిగివచ్చి బండరాతిమీద కూచున్నాడు. నిక్కరుజేబులోకి చెయ్యిపెట్టి ఓ "పేకట్టు"పైకి తీసేడు. అది ఏమి టోనని బైనాక్యులర్సు పెట్టి చూతునూ? రొట్టెలు. మూడేమూడు రొట్టెలయినా ఒక్కొక్కటీ ఆంధ్రపత్రిక అంత ఉన్నాయి. వాటిని నెయ్యి నూనె ఏ వల్లకాదూలేదు. నిప్పులమీద కాల్చిన ఒట్టి పొడిరొట్టెలు. రెండు ఉల్లిపాయలు నంచుకుంటూ మూడు రొట్టెలూ తిన్నాడు. మంచినీళ్ళ ప్రసక్తే లేదు వాడికి; మనలాంటి వాళ్ళం అయితే అడుగు అడుగునా మెడబడిపోయి, గొంతుక దిగక, మూడుచెంబుల నీళ్ళు ఖాళీచేసేవాళ్ళం! అరి పిడుగా, అనుకున్నాను. చప్పట్లు కొట్టినట్టు చేతులు దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు. రెండో జేబులోంచి గుళ్ళు తీసి తుపాకి యెత్తి బారుగా అమర్చేడు.

నాకు కంగారు పుట్టింది. ఏంచేస్తాడు చెప్మా! ఏ అమాయిక జీవికి నూరేళ్ళూ నిండేయో? వీడినే రివాల్వరుతో కాల్చేస్తే? ఆ శబ్దానికి చుట్టుపట్ల వాళ్ళు ముట్టడించి నన్ను హతమార్చేస్తారు కాబోలు. కాకపోయినా ఒక్కడినీ బయలుదేరడం ఏమిటి, నా మొహం. ఇలాగ ఏదో తర్జనభర్జన చేస్తూనే ఉన్నాను—

వాడు ఓ మెట్లంగిరాయి పుచ్చుకున్నాడు కుడిచేత. తుపాకీ ఎడమచేతిలో వుంది. రాయి అంతరిక్షానికి రివ్వున విసిరేడు. రెప్పపాటు కాలంలో ఎడంచేతులో తుపాకి కుడిభుజం క్రిందికి వచ్చింది. గుండెకి ఆనుకుంది. 'బారెలు' క్రిందికి ఎడమచెయ్యి ప్రసరించింది. ఎడం కన్ను ముయ్యడం, కుడిది తెరవడం, కుడిచేతి చూపుడు వేలితో "ట్రిగ్గరు" లాగడం క్షణకాలంలో సంభవించేయి. చెప్పడమే ఆలస్యం అవుతోంది అనుకోండి! ఎగిరినరాయి ఆకాశంలోనే ఛిన్నాభిన్నం అయిపోయి తునకలుగా క్రిందపడింది.

ఏమి గురి! ఎంతత్వరితం!! రెప్పవెయ్యకుండా ఆశ్చర్యంతో బైనాక్యులర్సు దించకుండా అరగంటసేపు చూసేను. మన వేపు పశువులగుంటలు గోలీకాయలు ఆడుకుంటారు. వీళ్ళకి యిదీ పని! శహబాసు! ఇటువంటి నేర్పరులని మోసంచేతో, క్రౌర్యం చూపించో నాశనం చెయ్యడమా? ఏమి హృదయరహితమయిన పని! ఇందులో ఎందుకు చెయ్యిచేసుకున్నానా అనిపించింది. వీళ్ళకే సరియయిన సంస్కృతి కల్పించి, క్రమమయిన శిక్షణ యిచ్చినట్లయితే దేశమాతకి ఎంత చక్కటి అంగరక్షు ఏర్పడుతుందో కదా అని విస్తుపోయేను. ఆలోచిస్తూన్న కొద్దీ కడుపు దేవుకుపోయింది. ఇంక నిలవలేక యింటిముఖం పట్టేను. ఆకలి, దాహం, చికాకున్నూ. నీరసించిపోతూన్నట్టు అనిపించింది.

ఎంత నడిచినా అంతు కనిపించదేం?

ఎవరో ప్రక్కనించే వెళుతూన్నట్టయింది.

"క్వెట్టారహదారి యిక్కడికి ఎంతదూరం ఉంటుంది?"అని అడిగేను.

"మీరు క్వెట్టారోడ్డు వదిలి అయిదుమైళ్ళు ఆఫ్ఘనిస్థానంలోకి వచ్చేరు."

"చచ్చేన్రా భగవంతుడా!"

"మీకు వచ్చి భయంలేదు. మా ఆతిథ్యం స్వీకరించి, కాస్త విశ్రమించి సాయంత్రం మీ యింటికి వెళుదురుగాని"

భయం లేదని అతను అనడంతో నిజంగానే భయంవేసింది. తేరి పారిచూతునూ? తురకవాడు.

"అక్కర్లేదు. మీ ఆహ్వానానికి చాలా సంతోషం. నాదారిని నేను పోతాను"అన్నాను. బావిలోనుంచి వచ్చినట్టు వచ్చేయి ఆమాటలు పొడి ఆర్చుకుపోయిన నాగొంతుకలోంచి.

"మీరు అలా అనడానికి వీలులేదు. అర్థించినవారికి అతిథిసత్కారాలు చెయ్యడం మా మతం. సంశయించకండి. రండి, పోదాం!

ఆ మాటలలో ఏమీ వక్రత లేదు.

ఇంటికి తీసుకుపోయేడు. నులకమంచం ఆసనం. రెండు పొడిరొట్టెలూ నాలుగు ముల్లంగి దుంపలూ, పింగాణీగ్లాసునిండా మేకపాలూ పట్టుకొచ్చేడు. నాటుఫేక్టరీలో తయారయిన మోటుతుపాకులు రెండు గోడని తగిల్చి ఉన్నాయి. వాటివేపు చూస్తూ, నెమ్మదిగా ఆతిథ్యం స్వీకరించేను. ఆతరవాత హుక్కాగొట్టాం ముందుంచేడు.

ఏమిటో యీ వింతవైఖరి!

3

ఆ సాయంత్రం పటాలం ఒకటి కొండచరియలను ఆనుకుని పోతోంది. ఇంతలో "ఢాం" మ్మని తుపాకీ పేలినశబ్దం.

పటాలంలో ఒకడు బలిఅయి పడిపోయేడు.

దళనాయకుడికి పట్టరాని కోపం వచ్చింది. కొండకి ఇరుప్రక్కలా గురిచూసి కాల్చమన్నాడు.

పావుగంటసేపు పటాలం మెషీనుగన్ను పేల్చింది. ఫలితంమాత్రం శూన్యం. చరియలో ఉంది పటాలం. పైనకొండమీద ఏ బండచాటున దాగున్నాడో ఆ కాల్చినవాడు. ఏ తుప్పచాటున పొంచిఉన్నాడో!

మళ్లీ ముందుకు సాగబోయింది పటాలం.

"ఢాం. ఢాం. ఢాం" ముందున్న ముగ్గురూ పిట్టల్లాగ పడిపోయేరు. పటాలం నాయకుడు రుద్రుడయిపోయినాడు. కోపం, అవమానం అతన్ని చికాకుపరిచేయి. మళ్లీ "ఫైరుఆర్డరు"!

అట్నుంచిగూడా తుపాకీ పేల్చిన చప్పుడు!

మరోక పదిమంది పటాలంలో ఆహుతి అయి పడిపోయేరు. కొండలోయ యుద్ధభూమి అయి ఊరకుంది.

అంతలో కొండమీద తుప్పచాటున ఏదో కదిలినట్టయింది. ఆ చోటు గురిచూసి కాల్చేడు నాయకుడు. "ఢాం!"

ఈసారి గురితప్పలేదు. ఆ దెబ్బకి కొండమీద నుంచి దొర్లుకుంటూ వచ్చి పటాలంకాళ్ల దగ్గిర పడ్డాడు ఒకడు. పడ్డాడో లేదో స్ప్రింగు బొమ్మలాగ లేచి మరో ముగ్గుర్ని కాల్చేసేడు.

నాయకుడి 'బేయొనెట్టు" డొక్కలో దూసుకునే దాకా వాడు ప్రాణాలు కోల్పోలేదు. అసువులుబాసినా ఆయుధంమాత్రం రెడీగా హస్తభాగాన్ని అలంకరించేఉంది. ఎవడో కాదు వాడు. వాడే, ఆపశువులకాపరి కుర్రాడు.

ఒంటిమనిషి సర్వాయత్తమయిన ఒక పటాలాన్ని ఎదిరించి సుమారు రెండుగంటలసేపు నిరోధించేడు. పాతికమందినయినా బలిగొంటేనేగాని ప్రాణాలు త్యజించేడు కాదు. ఏమినైపుణ్యం, ఎంతధైర్యం, ఎంతటిసాహసం!!

పటాలం నాయకుడే మెచ్చుకున్నాడు. మిలిటరీ ఆనర్సుతో ఆకొండవాడి అంత్యక్రియలు ముగిసేయి.

లండనులోని అంతర్జాతీయ భాషాసమితిసభలో బ్రిటిష్‌వలసలశాఖ కార్యదర్శి క్రీచ్‌జోన్స్ ఉపన్యసిస్తున్న దృశ్యం.

నెరసిన వెంట్రుకలఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని. రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచమైయుండిన రూ 2-8-0; మధ్యరకమైయుండిన రూ 3-8-0; పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:-ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

Kesh Ranjan Aushadhalaya,
M. 63, P.O. Ranigani (Burdwan.)

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని, పెరిదేపి-నెల్లూరు జిల్లా.